## వీరగల్లు!

పాలనాధికారానికి పక్షవాతం సోకి
గాఢాంధకారం గ్రామాలను కుమ్మినకాలం!
ప్రత్యేక శిక్షణ పొందని పరాధీనులు
స్వయం ప్రతిఘటనకు చుట్టిరి శ్రీకారం!

ఎడమచేతిలో విల్లు
కుడిచేతిలో బాణపు పుల్ల
నడుమున కత్తి
వీపున అమ్ములపొత్తి!

కురులు కుదురుగ సిగముడిచి
పౌరుషం మీసాలుగ మెలివేసి
శిరసును మోరలెత్తించి
సమరశంఖం పూరించిన సామాన్యులు!

క్రూరమృగాలతో పోరుసాగించి
ప్రాణ మానధనాలను పరిహరించే
ముష్కర మూకలను దునుమాడే క్రమాన
తృణప్రాయంగా అసువులు వీడిన అభిమన్యులు!

కాలంకరిగిపోయినా
కల చెదరనీయని
కర్మవీరులు వారు
కలకాలం కంటికి రెప్పలా
కాచుకునే వీరభద్రులు!

తమపశువులు తమశిశువులు
శాశ్వతమై వర్ధిల్లాలని
గ్రామాలను గూడేలను నిరంతరం
గస్తీకాసే కాలభైరవులు!

త్యాగం మూర్తీభవించిన శిలలు
స్మృతి పార్థీవభించిన చిహ్నాలు
నిత్య నీరాజనాలందుకునే వీరగల్లులు!
ప్రజావీరులు! మృత్యుంజయులు!!

(తెలంగాణలో ఇటీవలి కాలంలో తవ్వకాల్లో ఇబ్బడిముబ్బడిగా బయటపడిన శిలావిగ్రహాలు)



-కరిపె రాజ్ కుమార్
8125144729

## అవ్వ ...అయ్యా

అమ్మ ప్రాణ వాయువు అయితే..
నాన్న మన..ఆయువు

అమ్మ మన ఊపిరి..
నాన్న మన కాపరి.
అమ్మ మన కళ్ళు..
నాన్న మన కాళ్ళు.

అమ్మ మన గళం..
నాన్న మన బలం.
అమ్మ మన మనస్సు..
నాన్న మన మేథస్సు.

అమ్మ తలపు అయితే..
నాన్న మన గెలుపు.

అమ్మ మన సహనం..
నాన్న మన ప్రహసనం.

అమ్మ మన లక్ష్యం అయితే..
నాన్న దానికి సాక్ష్యం.
అమ్మ మన ఆత్మ అయితే..
నాన్న మన పరమాత్మ.

తమ సహనంతో నిరంతరంగా
నిస్వార్థ ప్రేమను కానుకగా
అందిచే అమ్మా నాన్న లకి..
అవ్వ అయ్యా ఎవరు గొప్ప
వద్దు అనవసరపు రాద్ధాంతం.

ఇద్దరు నిన్ను సృష్టిస్తే
నేను నీవు కలసి మనం
మన కుటుంబం

వృద్ధాప్యంలో చిదరించుకోకు
అన్ని ఉన్న అనాథను చెయ్యకు
ఆకాశంలో సూర్య చంద్రుని వంటి
వారు అవ్వ అయ్యలు
బిడ్డల క్షేమమే ధ్యేయంగా
దాచి దాచి పెట్టె అమ్మ
అలిసి సొలొసి ఇంటికి రాగానే
వాడెక్కడ అది ఎక్కడ తిన్నారా
ఆత్రుత తో అడిగే అయ్యా
ఎవరిని తక్కువ చేసి చూడగలం
అవ్వ అయ్యా



-వి.శేషారావు
9440408080

## జీవవైవిధ్యానికి పట్టుగొమ్మలు

సాగర సంపదకు ఆవాసాలు
ప్రాణవాయువు నివాసాలు
జీవరాశికి జీవనాధారాలు
జీవవైవిధ్యానికి పట్టుగొమ్మలు
మన మహాసముద్రాలు..!

వైద్య పరమైన ఔషధాలు
విలువైన ముత్యాలు,ఖనిజాలు
ఖరీదైన గ్యాస్ పదార్థాలు
ముడిచమురు ఉత్పత్తులు
అందించు మన సముద్రాలు..!

సముద్ర ఆహార పదార్థాలు
పక్షుల విడిది కేంద్రాలు

అందమైన విహార స్థలాలు
వాతావరణ వాహకాలు
మన సముద్రాలు ..!

మత్స్య పరిశ్రమ కేంద్రాలు
జల రవాణా సాధనాలు
వర్షానికి ఆధార భూతాలు
జల సంరక్షణ ప్రదాతలు
మన సముద్రాలు..!

సాంకేతిక ఉత్పత్తుల విశేషాలు
నౌకా కాలుష్యాలు
మైనింగ్ వ్యర్థపదార్థాలు
ప్లాస్టిక్ వ్యర్థాలు
సముద్ర కాలుష్య కారకాలు..!

భూతాపం తగ్గించి
సమతుల్యతను రక్షించి
వేలాదిమందికి ఉపాధినిచ్చే
సముద్రజలాలనురక్షించుకోవాలి
పర్యావరణాన్ని సంరక్షించుకోవాలి..!



-పిల్లి.హజరత్తయ్య
9848606573

## ఉప్పెన

ఇంటింటా కురిసే వృథా కథల వర్షపు ధారలు
ప్రతికంటా ఆగక కారే కన్నీటి కాలువలు
గుండె గుండెనూ బద్దలు కొడుతున్న
అనుకోని వార్తా పిడుగులు
ప్రతి మనసునా సుడులు తిరిగే వేదనా వలయాలు.

వీధి వీధినా పొంగుతున్న శోకాల వెల్లువలు
ప్రతి కుటుంబాన మృత్యువు చేస్తున్న కరాళ నృత్యాలు
ఊరూరా నిరంతరం పారుతున్న నిరాశా నదులు
ప్రతి దేశానా ఉప్పొంగుతున్న దుఃఖపు వరదలు.

ప్రతి ఒక్కరిలో కదిలాడుతున్న భయం నీడలు
ప్రతి ఊహనూ వణికిస్తున్న ఆందోళనా జాడలు
ప్రతి ఆలోచననూ అడ్డుకుంటున్న అశక్తతా పొడలు
ప్రతి కదలికనూ నిలేస్తున్న స్తబ్ధతా గోడలు.

పిల్లల్ని కోల్పోయిన పెద్దల్లో ఎగిసిపడే ఆక్రోశపు అలలు
తల్లిదండ్రులు దూరమైన పిల్లల్లో నిస్తేజపు చూపుల మంచుగడ్డలు
మదిమదినీ కలవరపెట్టే వీడని అనుమానపు ముసురులు
యాంత్రికమైన జీవితాన గమనింపుకు నోచుకోని ఆశల మేఘాలు.

ఈ పెను విలయపు ఆవలిగట్టుకు చేరే యత్నంలో..
ఒక్కొక్కరమే అయితే కొట్టుకుపోతాం గడ్డి పరకలమై!
అందరం కలిసి ఐక్యంగా అల్లుకుని మోకుగా మారితేనే
సురక్షితంగా దాటగలమీ భయావహ అస్వస్థతా ఉప్పెనని!



– ఎస్. కాశింబి
సెల్: 9052216044

## మరుభూమే చిరునామా

పల్లవి: ఈసెదు బంగారమున్న వీసమెత్తు వెంటరాదు
కోట్లాది రొక్కమున్న– ఒక్క రూక వెంటరాదు ॥2॥
కర్మఫలము ఒక్కటే కట్టె వెంకటవస్తుంది
ఈ మర్మము తెలుసుకో– ధర్మముగా మసలుకో ॥వీసెదు॥

వేదాలసారమును వడపోసిన ద్విజులారా
కావ్యాలను రాసి యెన్నొ– మాన్యాలను పొందిననూ
కనకాభిషేకాలు– సత్కారము లందిననూ
తుది శ్వాస విడువగానే– గదిబయటే పెడతారు
ఈ మర్మము తెలుసుకో– ధర్మముగా మసలుకో
మనిషిగా నీ గతిని– మంచివైపు మలుచుకో ॥వీసెదు॥

రక్తాన్ని చిందించి– రాజ్యాన్ని విస్తరించి
ఖజానా నింపుకొని– మజాచేసే రాజులారా
మా 'మాటే' శాశనమని– హూంకరించె ప్రభువులారా
బొందిలోన గాలిపోతే– మందిరాన ఉంచబోరు ॥వీసెదు॥
తూనికలు, కొలతలందు తాపీగా మోసగించి
ధనమెంతో కూడబెట్టి– దర్జాలు వెలగబెట్టి
కుభేరులుగా వెలుగొందే– వాణిజ్యవేత్తలారా
ఆయువు మూడిన పిదప– ఆవలనే పెడతారు–
–ఈమర్మం తెలుసుకో॥

-చింత రమణ
సెల్:9701652766

## "మానవత్వం"

(కథ)

జోగిపేటలో బట్టల వ్యాపారం చేసా్త బతికేవాడు బాల స్వామయ్య.అతని దగ్గర బట్టలు కొనడానికి జనాలు ఎగబడేవారు. దానికి కారణం మంచి నాణ్యమైన బట్టలు సరసమైన ధరలకు విక్రయించే వాడు. నిజాయితీకి మారుపేరు. అందుకే అతని బట్టల వ్యాపారం "మూడు పువ్వులు ఆరు కాయలుగా'' వర్ధిల్లింది .అతనికివ్యాపారంలో చేదోడువాదోడుగా భార్య మంగమ్మ ఉండేది.

బాల స్వామయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఒక కూతురు. వారికి కష్టం అంటే ఏమిటో తెలియకుండా, పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులను నేర్పించాడు. మంచి చదువులు చెప్పించాడు. తమకున్న ఒక్కగానొక్క కుమార్తెకు మంచి సంబంధం చూసి వివాహం జరిపించాలని, డబ్బులు కూడ బెట్టే వాడు. అనుకున్నట్లే మంచి సంబంధం దొరికింది. ఉద్యోగం చేస్తున్న అబ్బాయికి కుమార్తెను ఇచ్చి, వివాహం జరిపించాడు.

తన పెద్ద కుమారుడు కూడా కరెంట్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం వచ్చింది. చాలా సంతోషం కలిగింది కూడా. మంచి సంబంధం చూసి, కొడుక్కి వివాహం జరిపించాడు. మిగిలిన ఇద్దరు కుమారులకు కిరాణీ హోల్ సేల్ షాప్ను పెట్టించాడు. వారిద్దరికి కూడా వివాహం జరిపించి తన బాధ్యత తీర్చుకున్నాడు బాల స్వామయ్య.

వ్యాపారంలో తాను సంపాదించిన, సంపాదనంతా ముగ్గురు కుమారులకు, కుమార్తెకు సమానంగా పంచి ఇచ్చాడు .తనకు వయసు అయిపోయిందని, వ్యాపారం కూడా మానేశాడు. కొద్దిరోజులు కొడుకులు కోడండ్లు ప్రేమగా చూసారు. అదే క్రమంగా తగ్గిపోయింది. సూటిపోటి మాటలు ఎక్కువ అయ్యాయి. మౌనంగా భరించేవారు బాలస్వామి దంపతులు. కొద్దిరోజులకు బాల స్వామయ్య భార్య మంగమ్మ కాలం చేసింది.

భార్య వియోగాన్ని తట్టుకోలేక ఒంటరి పక్షి అయ్యాడు బాల స్వామయ్య. అదే దిగులు పెట్టుకొని మంచాన పడ్డాడు. కనీసం కొడుకులు, కోడళ్ళు పట్టించుకునేవారు కాదు. తీవ్రమైన మనోవేదనకు గురైన అతను చివరికి మరణించాడు.

తన తండ్రి అంత్యక్రియలు చేయడానికి కూడా ముగ్గురు కుమారులు కుమార్తె కూడా ముందుకు రాలేదు. అందరూ ఉండి కూడా అనాథ శవంగా బాల స్వామయ్య మిగిలిపోయాడు. ఇది గమనించిన గ్రామములోని ముస్లిం యువకులు ఆ శవానికి అంత్యక్రియలు మేము చేస్తామని మానవత్వంతో ముందుకు వచ్చారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ఐదుగురు యువకులకు తెలిసిన పని. కులమతాలతో సంబంధం లేనేలేదు. అందుకే బాల స్వామయ్య అంత్యక్రియలను ముందుండి నడిపించారు. కన్న వాళ్ల కంటే, మనసున్న మా రాజులు ఈ ముస్లిం యువకులు అని అందరూ అభినందించారు.

-నీతి: కుల మత భేదం వద్దు.
మానవత్వమే ముద్దు



-యాదవరనీ చంద్రకాంత్ గౌడ్
9441762105

## రెక్కలు

ఆ నాలుగు
సింహాలు
జాతి
ఔన్నత్యాలు
కాలం
సెలయేరు

మాట్లాడినట్టే
రాయాలి
రాసినట్టే
మాట్లాడాలి–
భాషా
వైకల్యం ఎందుకు

రోగాలు
రాకా
పోకా
కారకులు–
అణు
మానువులు

కాలంతో పాటే
సంస్కృతి
సంప్రదాయం
సాహిత్యం–
అంటుకట్టిన
కొమ్మలు

ఎదిగేవాడు
దేన్నీనమ్మడు
ఎదగని వాడు
ఎవర్నీ నమ్మడు
తాపట్టిన కుందేలుకు
మూడే కాళ్లు.

రచయిత
మాటలు
భావాలకన్న
చిన్నవిగా ఉండాలి–
మర్రి
విత్తనం

పడతి
పవిత్రను
పతనుడే
ప్రశ్నిస్తాడు–
కంటికి
కలక

కారా
మాస్టారి
కథా
నిలయం–
సిక్కోలు
కంచి



– డి.రాములు
సెల్:94403 76688

## వైవిధ్య కథలు

పుస్తక సమీక్ష



సమాజ సేవే పరమావధిగా నిర్ణయించుకున్న 'జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట'వారు తమ ప్రచురణతో జన జాగృతిగావించే సద్దుద్దేశముతో సుమారు మూడున్నర దశాబ్దాలుగా విశేష కృషి సలుపుతున్నారు. కవిత్వం, కథ, బాలసాహిత్యంతో జాతీయ వాదానికి ఊపిరులూదుతున్నారు.

నేటి వరకు వీరు 250 ప్రచురణలను ప్రజలకందించినారట! వెలువరిస్తోన్న ప్రతి 50వ ప్రచురణ సంకలనమై ఉండా లని ఆనవాయితీ నిర్ణయించుకు న్నారట!! సాహితీ భారతికి ప్రోత్సాహం, తద్వార సంక్షేమం– ఏకకాలంలో రెండు ప్రయోజనాలు. జాతీయ పరిషత్వారు అభినందనీయులు.

ప్రస్తుత కథాభారతి, కథా సంకలనం వీరి 250వ ప్రచురణయట. ఇందులో 15 కథలున్నాయి. సీనియర్ మరియు జూనియర్ రచయితల కథలతో సంకలనం పాలు– పంచదారల సమ్మిశ్రణంగా శోభిల్లుతోంది.

వర్తమాన, సమకాలీన సంస్కృతికి ప్రతిఫలనాలుగా నేటి కథలను చెప్పుకోవచ్చును. బాల్య వివాహం కన్యాశుల్కం, దేశ స్వాతంత్ర్యం, నిజాము పాలన విముక్తి లాంటి కథావస్తువులు ఒకనాడు కనిపిస్తే, పట్టణీకరణ విదేశ వలసలు, సాఫ్ట్వేర్ చదువులు ప్రాభవం కోల్పోతున్న వృత్తులు ప్రజాప్రతిఘటనలు నేటి ఇతివృత్తాలవుతున్నాయి.

ఈ నేపథ్యంలో 'కథా భారతి' ఒక వైవిధ్య కథల సమాహారంగా చెప్పుకోవచ్చును. ఒక కథ 'భామాసాహి' తప్ప మిగతావన్నీ సాంఘిక ఇతివృత్తాలు పల్లెల్లోని సగటు మనిషి బ్రతుకు వెతలు. వస్తువుల అమ్మకంలో 'ఓ ఫిక్సు రేటు పెట్టుకుంటే న్యాయంగా ఉంటుందని అనుకుంటాము, కాని లౌక్యం తెలిసిన హన్మాండ్లు, కొనుగోలుదారుని ఆర్థిక పరిస్థితిని బట్టి రేటు మారుస్తేనే Successful Businessman అవగలడని వాసాల నర్సయ్య "ముసుగు దొంగలు" వివరిస్తుంది. ఏ చదువులేని హన్మాండ్లు Economics లో బోధించే Price Descrimination సూత్రాన్ని పాటించి తన అమ్మకాలను పెంచుకోగలగటం పాఠకుడిని ఆశ్చర్యపరుస్తుంది.

యువతకు రాలేజీ జీవితం ఓ Turning Point . నేటి యువత కాలేజీ జీవితాన్ని 'పగటి కలలు'గా మార్చుకుని భంగపడి ఎదురుదెబ్బలు తినవద్దని ప్రభోదించే కథ 'శుభలేఖ'. సందేశం సారకృత,కొసమెరుపు మరియు మనిషి స్వాప్నిక ప్రపంచానికి బాహ్య ప్రపంచానికి గల తేడాను తనదైన శైలిలో చెబుతున్నాడు ప్రముఖ కథకుడు ఎన్నవెళ్ళి రాజమౌళి. నామని సుజనాదేవి కథ 'సౌందర్యం' కూడా. అనాకారి శార్వాణిని అలా ఊహాలోకాల్లోకి తీసుకువెళ్ళి, అమాంతం గా నేలకు గిరాటేయబడి, నిజం తెలుసుకోమంటుంది. ఎదుటి వాటి బలహీనతతో ఎలా 'ఆదుకుంటారో' తెలిపే ఈ చిన్నకథ, రెండు పేజీల్లో ముగిసి, యువత వాస్తవికతను అవగాహన చేసుకోవాలంటుంది.

భారతంలో చెప్పబడిన బకాసురులు ఈనాడూ ఉన్నారని వారి సంఘ విద్రోహక చర్యలను ఎదుర్కోవటానికి ఒక వ్యక్తి చాలదు. సామూహిక శక్తి కావాలని, ప్రముఖ కథకుడు కస్తూరి మురళీకృష్ణ 'బకాసురులు' తెలుపుతుంది అమ్మలోని బంగారు మనసును కళ్ళకు కట్టిస్తాడు ప్రముఖ విద్యావేత్త డా॥టి. శ్రీరంగస్వామి. మరో ప్రముఖ రచయిత దోరవేటి చెన్నయ్య 'నాయనమ్మ' కథలో తల్లి నిస్సహాయత కొడుకుల దౌష్ట్యం కళ్ళకు కడతారు.

ఎంచుకున్న వస్తువును కళాత్మకంగా సృష్టించగలిగారు సంకలన సంపాదకుడు ఐతా చంద్రయ్య. క్రొత్తపాతల మేలు కలయిక లాగా అన్ని వయసుల రచయితలు తమ నేర్పును చూపగలిగారు. తెలంగాణ ప్రాంత 'కథా వైవిధ్యం' వివరించే ఈ కథలు పాఠకుడిని ఆకట్టుకుంటాయి.

ప్రతులకు: జనసాహిత్య పరిషత్
సిద్దిపేట మరియు
ప్రముఖ పుస్తక కేంద్రాలు.



– కూర చిదంబరం
సెల్: 8639338675

## నీది అనుకునేదంతా శూన్యం

కాల జీవన పయనంలో
అంతా నాదనుకునే ఓ మానవుడా...!
పుట్టే ముందు నువ్వు ఎవరో..?
నువ్వు జీవించడం ఒక అందమైన
అబద్ధమో.. కలనో..ఊహనో కావచ్చు..!
మురిపిస్తున్న శరీరం నాదని అహం
ఆకాశం ఎత్తు ఎదిగానని వెర్రితనం
భూమిపై నడవడితో విచ్చలవిడితనం
అల్లాడిపోతూ ఆక్రోషిస్తుంది నిశీథి
డబ్బే సర్వస్వంగా శ్వాసించిచావు
నీ కలల భవంతులతో నీవు ఎవరో తెలియక
భ్రాంతి వలయంలో తేలిపోతున్నవు..!
ప్రకృతి ఇచ్చిన ప్రాణవాయువును హరించి
నీది కాని కృత్రిమ శ్వాస పీల్చుతూ
నాలుగు తెరల మధ్య అరచేతిలో విశ్వాన్ని
మునివేళ్ళతో వెతుకుతున్నావు.!
నాగరికత నేర్పించిన పాఠాలు
అనాగరికుడిగా అభివృద్ధి పంథాలో
వినాశనాన్ని వెతుకుతున్నావు..!
సృష్టినంతటిని శూన్యంలోకి నెటివేస్తున్నావు
నాది అనే భావనతో విఱ్ఱవీగుతున్నావు
పొగరు నెత్తికెక్కి ఎగిసెగిసి పడుతున్నావు
రక్త సంబంధాలకును విభేదాలతో
అడ్డగోలుగా అడ్డుగోడలు నిర్మిస్తున్నావు!
అసూయతో నీది నాది అనే పెనుగులాటలో
సృష్టిని వినాశనాన్ని సృష్టిస్తున్నావు..!
ఏది ఏమైనా ఎన్ని యుద్ధాలు
ఎదిరించి నిలిచి గెలిచిన దేశాలు సైతం
రక్తం చిందించని కరోనా వైరస్ తో
శ్వాసయుద్ధం అనివార్యంగా మారుతుంది
విశ్వాన్ని చుట్టి ఉన్న ప్రతిజీవికి సవాళ్ళ
హెచ్చరికలతో కోరలు దాల్చుతుంది
గాలానికి చిక్కి శల్యమవుతున్న జీవితాలెన్నో
ఇప్పుడు మాట్లాడుకోవడాలు లేవు
కండ్ల ఊసులతోనే మాటలైనా,కన్నీరైనా,
బాధైనా చివరికి చివరి చూపు అయినా...
కారు చీకట్లు కమ్ముతున్న కాలానికి
ఎదురునిలిచి కాంతిరేఖవై ప్రజ్వరిల్లుదాం
కరోనా వింత నాటకంలో విషాదంతానికి
మాస్కుల తెరను దించి
సమాప్తం పలుకుదాం!!



-కొలిపాక శ్రీనివాస్
9866514972

## ప్రేమంటే?

మనసుకు సంబంధించిన
ఒక సానుకూల భావన
పరస్పర ఆకర్షణ
స్వార్థ రహితం
స్నేహం కంటే ఎక్కువ
భావోద్వేగాల సమ్మేళనం
ఇష్టంతో కూడుకున్నది
ఒక మధుర అనుభూతి
అదే
"ప్రేమ"



-మెందు ఉమామహేశ్వర్
9849741333

## కనిపించే దేవుళ్ళు

ఒకరేమో
కాలం ముళ్లను పక్కనపెట్టి
లోకానికి కాపలా కాస్తూ
సమాజసేవలో
తన సుఖాల్ని ఏమారుస్తుంటారు
మరొకరేమో
శాంతి పావురాళ్ళ వాలిపోయి
ప్రశాంతమైన ముఖవర్చస్సుతో
రోగికి రోగాన్ని మరిపిస్తూ
ప్రాణవాయువు నింపుతుంటారు
ఇంకొకరేమో
సమాజానికి పట్టిన
బూజును దులిపేస్తూ
మలినపడిన దారుల్ని
మల్లెపువ్వులా మారుస్తుంటారు
ఇక వారేమో
కెమెరా లెన్స్ ను ఎక్కుపెట్టి
పాళికి పదును పెట్టి
సమాచార వాయు వేగమై
వ్యవస్థకు చైతన్యం నింపుతుంటారు
కరోనా కష్టకాలంలో
కనిపించే దేవుళ్ళు ఎందరో



– నరెద్దుల రాజారెడ్డి
ఫోన్ :9666016636

## కోకిలమ్మ పదాలు

కరోనా రోగం
చేస్తుంది ఆగం
జీవితంలో ఒకభాగం
ఓ...కోకిలమ్మా....!!

చేతులను శుభ్రంగా కడుగు
పక్కవారి మంచిని అడుగు
అప్పుడైతది నీపేరు పొడుగు
ఓ...కోకిలమ్మా....!!

ఇంట్లోవుంటే నీకురక్ష
లేకుంటే పడునుశిక్ష
చైనోడికి భారత్ పైవున్నది కక్ష
ఓ.....కోకిలమ్మా....!!

మనోధైర్యమే మందు
బ్రతికితే వెస్తవు చిందు
తిరగకు సందు సందు
ఓ.....కోకిలమ్మా....!!

ఆదరణ కరువాయే
బతుకులు ఆగమాయే
చేయడానికి పనులు లేకపాయే
ఓ...కోకిలమ్మా.....!!

శాశ్వతము కాదు డబ్బు
దాచితే నువ్వు గబ్బు
దాయక కురిపించును మబ్బు
ఓ.....కోకిలమ్మా....!!

ఒక్కరిది కాదు పోరాటం
అందరికుండాలి ఆరాటం
జీవితమే రంగులరాట్నం
ఓ.....కోకిలమ్మా.....!!



-తాండ్ర చిరంజీవి
సెల్ : 9959180762

## నానోలు

కుక్క
విశ్వాసం
నక్క
నమ్మక ద్రోహం

అమ్మ
అదృష్టం
నాన్న
కల్పవృక్షం

ప్రేమ
త్యాగం
ద్వేషం
ఆగం

విద్య
జ్ఞానం
అవిద్య
అజ్ఞానం

అమ్మ
నీతి
నాన్న
నడవడిక

నిద్ర
సుఖం
మెలకువ
ఆలోచన

నడక
ఆరోగ్యం
పడక
అనారోగ్యం

అప్పు
ముప్పు
పొదుపు
మెప్పు

కరవాలం
భుజబలం
కలం
బుద్ధిబలం



– ఎం.ఏ. గఫార్
9490324834

## ప్రాణ దీపం

ఎంత ఒద్దిక
తాత గారి తాతల కాలం నుండి
ప్రాణ దీపమై నిలిచిన ఆ వృక్షం.

మిట్ట మధ్యాహ్న వేళ
నడి నెత్తిన కుంపట్లు పెట్టే
ఎండా కాలపు వేడిలోనూ
సేద దీర్చే హరిత నేత్రం...

కరుడు గట్టిన కసాయిలా
నిప్పులు కురిపించే వేడి రక్కసి
ఎదుట సిపాయిలా
ఎదురు నిలిచే
ఆకు పచ్చని ధైర్యం...

క్షణం కూడా తీరికలేని
నాగరిక ప్రపంచపు వేగం...
లేచిందే తడవుగా
హడావడి ప్రయాణం....

పట్నం నుండి సొంతూరుకి
రాగానే ఆత్మీయ బంధువులా
ఆ ఛాయా చిత్రం...

తరాలనాటి జీవన స్వరాలన్నీ
మౌనంగా పంచుకునే
జ్ఞాన చిత్రం..
చెట్టు కన్నా చెలిమిని పంచే
అద్భుత నేస్తం ఉండదన్నదే సత్యం
చెట్టే మరి అనిత్యమగు జీవన గీతికి
అనంత దీప్తిని అద్దే గాత్రం...



-వెల్మల జ...
9441168976

## స్మార్ట్ ఫోన్

తెల్లారిందగ్గర్నుంచి
తననె చూడమంటున్నది
చూడకుండ ఉండలేని
పరిస్థితిని తెస్తున్నది
స్మార్ట్ ఫోన్ కళ్ళముందు

కదుల్తూనే ఉంటది
అనుక్షణం నామదిలో
మెదుల్తూనే ఉంటది
పగలైనా రేయైనా
పని వున్నా లేకున్నా
తింటున్నా పంటున్నా

వెంటాడుతునే ఉంటది
మాటలతో బులిపిస్తది
పాటలతో మురిపిస్తది
దృశ్యాలతో అలరిస్తది
ప్రపంచాన్ని చూపిస్తది
నేను వీడుతానన్నా

నన్ను వీడనంటున్నది
'నన్ను వదిలి నీవు పో
లేవులే' అంటున్నది

– ఎ. గజేందర్‌రెడ్డి
సెల్: 9848894086

## బాల్యోదయము

బాలలము మేము,
భావిభారత పౌరులము మేము,
బాలలము మేము,
దేశాభ్యుదయపు కొమ్మలము మేము
కల్లాకపటమెరగని బాలలము
ఆ దేవునికు మారులమే మేము. //బాలలము//

మట్టివాసనతో జత కడదాము
మలినము లేకుండా కల్సివుంటాము
నీటిని చూస్తే చాలు ,ఈతలు కొడతాము
చెట్లును చూస్తే చాలు ఊయలులూగి
పండ్లు కోసేము
వాగులు,వంకలు,కొండ,కోనలు
తూనీగలు,తువ్వాయిలు
అందమైనవన్నీ మా నేస్తాలు
అందకపోయినా అవి మా ఇష్టాలు //బాలలము//

వానలో కాగితపు పడవలు వేస్తాము,
తాటికాయలతో రెండుచక్రాల బళ్లవదాము
బడిగోడ గెంటి,క్లాసులెగొట్టి,
బండ ఎండలోనైనా బండెడు ఆటలు ఆడదాము
మా వయసువారితో ఆరుబయట తిరుగుదాము //బాలలము//

మారుతున్న కాలముతో
మా బాల్యము మారిపోయింది
కార్పొరేటు కబంధహస్తాల్లో
ర్యాంగుల పరుగుల ఒరవడిలో
మా బాల్యము "చిక్కిపోయింది"
స్వేచ్ఛగా తిరిగే రోజులే లేవాయి
వయసుకి మించిన పుస్తకాల బరువు
మా మనసును,వయసును దిగమ్రింగాయి //బాలలము//

పసిబాలల మనసులు చిదమద్దు
కసిబాలలులా వారిని మార్చొద్దు
అందమైన ప్రకృతిలో వారికి
బాల్యము హాయిని ఇవ్వండి
నీతి కథలు బోధించి,మహాత్ముల గాథలు వివరించి
బాలల్లో బాల్యపు గురుతులు నిలపండి
బాల్యోదయానికి పెద్దలు ఊపిరిపోయండి //బాలలము//



-విశ్వనాథ నరసింహం
9490971589

## నేటి నిరుద్యోగి బ్రతుకు ఆవేదన !!!

అక్షరమై వెలిగిన ఆరుతున్న దీపం
నేటి నిరుద్యోగి ...!
మోసిన అక్షరం బరువు
బ్రతుకు కు భరోసా కాలేక
విరామం లేని రణం చేస్తూ
పొట్టకూటి కోసం పట్టుబట్టి పట్టభద్రుడై
కాళ్లకు గిట్టలు కట్టుకొని
కోరికల గుట్టలు చేరాలన్న తపనతో
అటకెక్కిన ఆశయాల దారుల్లో
సడలిన సంకల్ప యోగి నేటి నిరుద్యోగి !
నచ్చి చదివిన పెద్ద చదువులన్నీ ,
అడుగంటి సముద్రాల య్యే ..
పరిజ్ఞానం కుప్పలు పోసుకొని ఉండే ,
కానీ గిట్టుబాటు ధర లేక పోయే ..
పట్టాల చదువున్న ఉద్యోగం లేదాయె
నిరాశతో నిరుద్యోగిలా మిగిలిపోయే
కన్న వాళ్ళకె బరువై పోయె
బ్రతుకే కన్నీటి జీవనమాయె
డిగ్రీలు పుచ్చుకొని దిక్కుల చూపులాయే

తల్లిదండ్రుల ఆశలు ఆవిరైపోయె
కొలువుల జాడకై ఎదురు చూసి
దప్పిక తీరక గొంతుకల తడారిపోయే
సూటిపోటి మాటలు, హేళనలు
సున్నితమైన మనుసుల్ని చిద్రం చేసి పోయే
నిత్యం ఉరికొయ్యల తో కొట్లాటలయ్యే
ఉద్యోగ వేటలో జోగిగా తిరుగుతున్న
నేటి నిరుద్యోగి ...!!
ఉద్యోగ ప్రకటనల కొరకు
ఎదురు చూపులాయే
కుటుంబ భారాన్ని మోయలేక
కూలీలుగా మారిపోయే
నేటి నిరుద్యోగి ..
సానుభూతి మాటల్ని వినలేక
జాలి చూపే కళ్ళన్నీ అసలే కనలేక
వెక్కిరించే తలరాతను మార్చలేక
నెత్తి నున్న దరిద్ర్యాన్ని దించ లేక
కన్న కలలు కన్న వారు గుర్తొచ్చి
లోలోపల భారమైన గుండెంతా బరువైన

నవ్వలేక.... ఏడ్వలేక ...
నటిస్తూ బ్రతక లేక ....
కన్నీటిలోని నీటి చుక్క
బయటకి రానీయ్యాక
గొంతులోనే బాధను దిగమింగుకుంటున్న
నేటి నిరుద్యోగి ...!
పేదరికం మెడలు వంచే సవాళ్లను
తిరిగి కొట్టేదెప్పుడో
అవస్థ పోయేటి వ్యవస్థ ఎప్పుడు వచ్చునో
ఈ కుళ్లు సమాజం ఏ రోజు మారునో
నిరుద్యోగుల జీవితాల్లో
వెలుగులు నిండేదెప్పుడో
నిరుద్యోగమే లేని
భారతావనిని చూసేదెన్నడో !!!



-నందిని గోపు
6302398650

## సువర్ణ ముఖి

–కథానిక

ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా తాతయ్య తీర్థ యాత్రలకు వెళ్ళి వచ్చాడు.తాను చూసిన ప్రసిద్ధి స్థలాల గురించి తన మనమళ్ళకు చెప్పే వాడు. తాతయ్య రాగానే పిల్లలందరు చుట్టు ముట్టారు.

"తాతయ్య! ఈ సారి ఏ ప్రదేశం చూసారు" కుతూహలం ఆపుకోలేక అడిగింది రమణి.

"ప్రముఖ శైవ క్షేత్రం శ్రీకాళహస్తి కి వెళ్ళానర్రా"చెప్పాడు తాతయ్య.

"శ్రీకాళహస్తి ఎక్కడుంది తాతయ్య!"అడిగాడు రాజేష్.

"ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ ప్రాంతం చిత్తూరు జిల్లాలో ఉందర్రా"అన్నాడు తాతయ్య.

"రాయలసీమ ప్రాంతంలో ఎన్ని జిల్లాలు ఉన్నాయి తాతయ్య" అడిగాడు నవీన్ .

"రాయలసీమ ప్రాంతంలో కర్నూలు , అనంతపురం ,కడప , చిత్తూరు ఉన్నాయి.చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తి ఉంది."

చెప్పాడు తాతయ్య.

"శ్రీకాళహస్తి కి ఆ పేరు ఎలా వచ్చింది తాతయ్య!" ఆతృత తో అడిగింది రమణి.

"మంచి ప్రశ్న వేసావు! శ్రీ అనగా సాలెపురుగు, కాళ అనగా నాగుపాము, హస్తి అనగా ఏనుగు. ఈ మూడు జంతువుల కలయిక వలన శ్రీకాళహస్తి అని పేరు వచ్చింది. ఆ ఊరులో శివాలయం, సువర్ణ ముఖి నది ప్రసిద్ధి చెందినది " చెప్పాడు తాతయ్య.

"సువర్ణ ముఖి నది గురించి చెప్పండి తాతయ్య"ఉత్సాహంగా అడిగాడు రాజేష్ .

"అలాగేనర్రా! మరి చెపుతాను శ్రద్ధగా వినండి.స్వర్ణ ముఖి నది దక్షిణ భారత దేశంలో ప్రవహించే ఒక నది. చిత్తూరు జిల్లాలో ప్రముఖ నది.ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తి ఈ నది ఒడ్డున వెలసి ఉంది.

తిరుపతి– చంద్రగిరి మధ్య తొండవాడ సమీప కొండక ప్రాంతం ఈ నది జన్మ స్థానం ధూర్జటి తనరచనల్లో దీన్ని 'మొగలేరు' అని ప్రస్థావించాడు. ఈ నది ఒడ్డున శ్రీకాళహస్తీశ్వర దేవాలయం ,తొండ వాడ వద్ద ఉన్న అగస్తేశ్వరాలయం,యోగి మల్లవరం వద్ద ఉన్న పరాశరేశ్వరాలయం , గుడి మల్లం దగ్గరున్న పరశురామేశ్వరాలయం ,గాజుల మండ్యం దగ్గరున్న మూలస్థానేశ్వరాలయం ఉన్నాయి. ఇది జీవనది కాదు. సాధారణంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ దాకా ప్రవహిస్తుంది. ఈనది భీమ, కళ్యాణి నదులలో సంగమించి, తొండ వాడలో త్రివేణి సంగమంగా మారి, ఉత్తరవాహినిగా ప్రవహించి తూర్పున బంగాళాఖాతంలో కలుస్తుంది." వివరించి చెప్పాడు తాతయ్య.

"జీవనది అంటే ఏమిటి తాతయ్య" అడిగింది సుమతి.

"జీవనది అంటే నీళ్ళు ఇంకిపోయి మిగతా నీళ్ళు ఎప్పుడు ప్రవహిస్తూ ఉండేవి." అన్నాడు తాతయ్య.

"మరి జీవనదులు ఏవి తాతయ్య!" అడిగింది రమణి.

"చాలా ఉన్నాయర్రా! ముఖ్యంగా మన భారత దేశంలో గంగ, సింధు, యమున , బ్రహ్మ పుత్ర, గోదావరి, కృష్ణ,పెన్నా , కావేరి చెప్పవచ్చు" సందేహాన్ని తీర్చాడు తాతయ్య .

"స్వర్ణ ముఖి కి ఆ పేరు ఎలా వచ్చింది తాతయ్య" మరో సందేహాన్ని వెల్లబుచ్చాడు రాజేష్ .

"ఈ నది గురించి ఒక పురాణ గాథ ఉంది.

పూర్వం అగస్త్య మహర్షి బ్రహ్మను గురించి తపస్సు చేసి నదిని దేవలోకం నుంచి క్రిందికి తెప్పించినట్లు స్థల పురాణం ద్వారా తెలుస్తుంది.శ్రీకాళహస్తీశ్వ రాల యాన్ని నిర్మించేటప్పుడు ఆలయ నిర్మాణం లో సహకరించిన కూలీలు రోజూ సాయంత్రం నదిలో స్నానం చేసి, ఇసుక వారి చేతుల్లోకి తీసు కుంటే నది వారు చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం గా దాని విలువచేసేంత బంగారం గా మారేది.

అందుకే ఈ నదికి సువర్ణముఖి, స్వర్ణముఖి అనే పేర్లు వచ్చాయి." చెప్పాడు తాతయ్య.

"ఓహో ! స్వర్ణం, సువర్ణం అంటే బంగారం అన్న మాట" అన్నాడు నవీన్ .

"స్వర్ణ ముఖికి 'మొగలేరు' అని పేరు కూడా ఉందని అన్నారు కదా అదెలా వచ్చింది తాతయ్య!" సందేహాన్ని వ్యక్తపరచింది సుమతి.

"ఇంకా ఆ ప్రశ్న అడగలేదేమని అనుకున్నా! అడిగేశావుగా! ఈ నదీ తీరంలో విపరీతంగా మొగలి పొదలు పెరిగిన కారణంగా స్వర్ణముఖి నదికి కి "మొగలేరు" అనే పేరు వచ్చింది." నవ్వుతూ చెప్పాడు తాతయ్య.

"ఆ నది పైన వంతెన ఉందా తాతయ్య!" అడిగింది రమణి.

"మరిచిపోయానర్రా! శ్రీకాళహస్తి నడి బొడ్డున ఉండి పట్టణాన్ని కలుపుతూ 'రామసేతు' వంతెన ఉంది" చెప్పాడు తాతయ్య.

"స్వర్ణముఖి నది గురించి చాలా మంచి విషయాలు చెప్పారు తాతయ్య.ఈ సారి మా పాఠశాల అందరం శ్రీకాళహస్తికి విహార యాత్రకు వెళతాము" ఆనందంగా అన్నాడు రాజేష్ .

"అలాగే! ఈ సారి మరో తీర్థయాత్రకు వెళ్ళినప్పుడు మరో స్థలం గురించి చెబుతాను. మధ్యాహ్నం అయ్యింది. అందరు భోజనానికి పదండి" అంటూ అందరితో లేచాడు తాతయ్య.

-కయ్యూరు
బాలసుబ్రమణ్యం
9441791239

# కాకి శతకం



-హెచ్.ఆర్. చంద్రం
సెల్: 9493248053

గతమునందు నెవరు శతకము నిను గూర్చి
వ్రాసినట్టి ఆనవాళ్లు లేవు;
కాన, నది రచింప బూనుకొంటిని నేను,
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వ్రాయవలయు నూరు పద్యాలు పూర్తిగా,
శతక నామ మపుడె సార్థకమ్ము;
సాహసించినాడ సంకల్ప శుద్ధిగా,
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నిన్ను గూర్చి శతక మన్న కొందరు నవ్వు
కొందు, రైన నేమి కొదవ మనకు?
మొదలుపెట్టినాడ, వదలక పూరింతు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నిన్ను గొప్పచేసి నేను పొగడబోను,
వాస్తవాలె విశదపరతు నిచట;
అందరికిని తెలిసినట్టి పక్షివి నీవు,
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కానిపింతు వీవు ఖండాల నారింట,
కానరావు మంచు ఖండమందె;
నిను 'ప్రపంచ పక్షి' అని చెప్పుకొనవచ్చు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ప్రాంతములను బట్టి పలు రూపభేదాలు
కానవచ్చు, పేళ్లు గలవు పెక్కు;
'కాకి' యన్న పిలుపె కల దచ్చ తెలుగులో,
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

సంస్కృతమున నీకు చాల పేర్లున్నవి,
కలవు రెండు మూడు తెలుగులోను;
కాని, రూఢ మందు 'కాకి' అన్నట్టిదే,
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పక్షులందు కొన్ని ప్రత్యక్షమే కావు,
కానవచ్చు అరుదుగానె కొన్ని;
నిత్య దర్శనమ్ము నీ వొసంగెదు మాకు,
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నిన్ను జూడకుండ, నీ గొంతు వినకుండ
నున్న నరు డొకండు నుండబోడు;
ప్రతి దినమ్ము నీవు ప్రత్యక్షమే కదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

తెలుగు భాషలోన గలవు జాతీయాలు,
సారవంతమైన సామెతలును;
నిన్ను గూర్చి యుండు నెన్నేని అందులో!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

'కావు కావు' మనుచు నీవు ప్రార్థింతువు,
కాని, యెవరు నిన్ను గావబోరు;
అరపు విన్నయంత అదలించివేతురు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పిండములను బెట్టు వేళ మాత్రము పితృ
గౌరవమ్ము పొందగలవు గాని,
ఇతర వేళలందు ఈసడింపులె దక్కు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ముట్టకున్న నీవు పెట్టిన పిండము,
ఫలము శ్రాద్ధమునకు గలుగ దన్న
భయముతోడ జనులు స్వాగతింతురు నిన్ను!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

గుడులు కట్టి పెంచుకొన్న మి మ్మూరూర,
శ్రాద్ధకర్మలపుడు చాల సుఖము;
పిలిచినదె తడవుగ పిండాలు తిన రార!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

బక కపోత శారి శుక పిక చటకాది
పక్షు లనుమతించబడవు; నీకె
శ్రాద్ధకర్మలందు శాస్త్రానుమతి దక్కె!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(బకము=కొంగ; కపోతము=పావురం; శారి=గోరువంక; శుకము=చిలుక; పికము=కోకిల; చటకము=పిచ్చుక)

సాదరముగ దేశ జాతీయపక్షి హో
దాను పొందియున్న గాని నెమలి
పిలువబడదు చూవె పితృకార్యములయందు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఎన్న దవతరించె నీ పక్షిగణములు?
జాతు లిన్ని యనుట సాధ్యపడున?
అంచనాలు తప్ప 'అసలు' స్పష్టము కాదు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఎపుడు రూపుదాల్చె నీ భూమిపై కాకి
జాతి?-అనిన , చెప్పజాలు నెవరు?
'ఇంచు మించు' తప్ప, 'ఇదమిత్థ' ముండదు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఖచ్చితముగ లెక్కగట్టుట కుదురని
వాని గూర్చి మనకు వాద మేల?
స్పష్ట విషయములనె చర్చించుకొందము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నిన్ను గూర్చి చాల నీచమ్ముగా అభి
ప్రాయపడినయట్టి వారు గలరు;
తెలిసి తెలియకుండ పలుకుటయే అది!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నిన్ను కించపరచుచున్నట్టి సామెతల్
తెలుగు భాషలోన గలవు పెక్కు;
'కాకి పిల్ల ముద్దు కాకి' కందొక్కటి!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

చిన్నబుచ్చినారు నిన్ను కొందరు పూర్వ
కవులు,లేవు తగిన కారణాలు;
వారి రచనలందు పాత్ర నీ కుండదు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నీతి కథలలోన నీ పాత్ర కనిపించు,
కావ్య రచనలందు కానరాదు;
దీని భావ మేమొ తెలియకుండెను గదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ప్రథమ కావ్య మైన రామాయణమునందు
పాత్ర నీకు నీయబడెను గాని,
నీచ పాత్ర జేసి నిను జూపి రందున!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కన్ను పొడిచినారు 'కాకాసురు'ని కథ
అల్లి! కాకి జాతికెల్ల నొంటి
కంటి చూపె యనుట కల్పనా? సత్యమా?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కవులు చిలుక చేత కథలు చెప్పించిరి,
పావురమును గూడ వాడుకొనిరి;
మరచినారు నిన్ను మాత్రము వా రేలొ!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

చిలుక పాటి నీవు చేయవా? తెలివిలో
చిలుక నిన్ను మించగలదె? జోస్య
మునకు చిలుకె గాని పనికిరావా నీవు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వార్త లందజేయ పావురమ్ముల వాడు
కొనిరి గాని, తలచుకొనరు నిన్ను;
నీవు చేయలేవె నేర్పింప ఆ పని?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వెలసె కొన్ని కావ్యములు పక్షి జాతుల
పేర్లతోడ, నీదు పేరుతోడ
కానిపించ దొక్క కావ్యమ్ము మచ్చుకు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

'గబ్బిలమ్ము' పేర కబ్బ మొక్కటి ' జాషు
వా' కవీశ్వరుండు వ్రాసె గాని,
నిన్ను గూర్చి వ్రాయ నేర్చిరా యెవరైన?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఇంతవరకు నెవరు నే పక్షి పైనను
శతక మల్లినట్టి జాడ లేదు;
నేను వ్రాయుచుంటి నీపైన శతకము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

శతక మేది? లేదు, జాతీయ పక్షిపై!
రాష్ట్ర పక్షిపైన వ్రాసి రెవరు?
వెలసె శతక మొకటి తొలుత నీ పేరనే!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వ్రాయ రెవరు చిలుకపై, గుడ్లగూబపై,
బాతుపైన, గద్దపైన గాని;
నేను వ్రాయుచుంటి నీపైన శతకము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పాలు నీరు వేరుపరచు నేరుపు గల
హంసపైన శతక మల్లి రెవరు?
నిన్ను శతకమునకు నెన్నుకొంటిని నేను!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

అంత పెద్దదైన ఆకార మున్న, 'రా
బందు' పై శతకము వ్రాయ రెవరు!
అట్టి గౌరవమ్ము నందుకొంటివి నీవు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కోళ్ల, పావురముల,గోరువంకల నిండ్ల
కొంతమంది పెంచుకొనుట కలదు;
ఐన, వెలయలేదు వానిపై శతకాలు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నేను వ్రాయుచుంటి నిను గూర్చి శతకము
సులభ శైలి, తేట తెలుగులోన;
ఆటవెలదులందు నందింతు నద్దాని,
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నిన్ను పూర్వ కవులు మన్నించకున్న, ఆ
ధునిక కవులు మెచ్చుకొనక యున్న,
'ఆది శతక పక్షి' యశము నీకే దక్కె!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఆరు ఋతువులందు నైదు ఋతువులలో
గొంతు పెగలకుండు కోకిలలను
మెచ్చు మానవులకు నచ్చ వీ వేలనో?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

మెచ్చుకొనెదు కవులు నచ్చిన కోకిల
పైన శతక మేల వ్రాయబోరు?
వచ్చె నీ శతకము ప్రజ లచ్చెరువు జెంద!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నలుపు రంగు పోల్చవలె నన్న నీ రూపె
ముందు గుర్తువచ్చు నందరికిని;
కోకిలను స్మరించుకొనబోవ రెవరును!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కల్పనలను జూచి 'కాకమ్మ కథ' లని
కొట్టి పారవేయునట్టి వారు
గలరు, నరులె కాద కల్పించు వారలు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వాడుచున్న నీదు పర్యాయ పదముల
లో 'నరిష్ట' మొకటి; దానికున్న
అర్థజాలమందు 'అశుభ' మొక్కటి చూవె!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

గుడ్లు పొదగలేని కోకిల కులము నీ
వలన వృద్ధి గాంచి వరలుచుండు;
నైన నిన్ను మెచ్చ, రది యేమి కర్మమో!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఒకరు మెచ్చుకున్న నున్న ప్రత్యేకత
తగ్గిపోదు గాని, తరతరాలు
చిన్నబుచ్చుచున్న మిన్నకుండుట యెట్లు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వేరుపడిరి వర్ణ భేదాలతో నరుల్,
పిట్టలందు చిచ్చుపెట్టి, నీకు
అంటరానితనము నంటగట్టిరి కదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఉచ్చ నీచ జాతు లూహించి, కల్పించి,
నీచజాతిలోన నిన్ను జేర్చి,
నష్టపెట్టె సుమ్ము నరజాతి నిన్నెంతొ!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

రంగు బట్టి నీకు భంగపాటు కలిగె
ననుటయు సరికాదు; మనుజ జాతి
గొప్పచేసి మెచ్చు కోకిల దే రంగు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

స్వరము బట్టి గౌరవము దక్కునా యన్న,
అదియు పూర్ణ సత్య మనగలేము;
కొక్కిరాయి గొంతు చక్కనా నీ కన్న?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

స్థాన మిచ్చినారు సప్త స్వరాలలో
క్రౌంచ పిక మయూర కంఠములకు;
నీకు మాత్ర మందు లేకపోయెను చోటు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(క్రౌంచము=కొంగ; పికము=కోకిల; మయూరము=నెమలి)

స్వరము బట్టి వెనుక వరుసలో నిలబెట్టి
చిన్నబుచ్చినారు నిన్ను నరులు;
స్వరము కన్న మిన్న సామర్థ్య మౌ గదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

రకరకాల పక్షులను పెంచెదరు జనుల్
ప్రీతి పంజరముల బెట్టి; నిన్ను
వేడ్క నొక్కరైన పెంచుకొందురె అట్లు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ప్రీతి పంజరమున బెట్టి పెంచకయున్న
బాధ లేదు, నీవు బ్రతుక గలవు;
గూడు పొడిచి, తరిమి కొట్టకుంటే చాలు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

గతమునందు పిచ్చుకలు స్వేచ్ఛగా విహ
రించె జనుల నడుమ; ఏవి నేడు?
పట్ట నేమొ నీకు నట్టి దుర్గతి యింక?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కట్టుకొందు వీవు కష్టించి నీ గూడు,
కాని, కొంతమంది మానవులకు
కుదుర దిల్లు కట్టుకొనుట జీవితమున!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

గూడు నీవు కట్టుకొన్న పెరటి చెట్టు
పైన, దాని నిష్టపడని నరులు
గలరు, విసుగుకొనుచు తొలగించివేతురు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పుడక లేర్చి కూర్చి, పొందికగా గూడు
కట్టుకొందు వీవు చెట్టుపైన;
గూళ్లు తోసివేయు కూళలు నుందురు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

రాల్చి కాకి గూళ్లు, రాజేసి పొయి,, వంట
చేసిపెట్టు మనెడు 'సింగరాజు
లింగరాజు' వంటి లేకివా ళ్లుందురు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(సింగరాజు లింగరాజు-వరవిక్రయం నాటకంలోని పిసినారి పాత్ర)

చెట్లపైన గాని, 'సెల్లు టవర్ల'పై
గాని మీరు గూళ్లు కట్టగలరు;
ఇళ్లపైన కట్టనిత్తురా మావాళ్లు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కోడిపిల్ల దన్నుకొనిపోవుటను తప్పు
పట్టు టెట్లు? బ్రతుకవలయు నీవు!
మనిషి జంతు-పక్షి మాంసాలు మెక్కడా?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఈసడింపు తప్ప యే యొక్క నాడును
పొందబోవు సానుభూతి సుంత;
మనుజ జాతి మధ్య మనుగడ నీ కేల?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

బతకలేవ మమ్ము వదలిన? మాపైన
నేల నమ్మ నీకు నింత ప్రేమ?
వనములకును పోయి మనరాద స్వేచ్ఛగా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

చంపి తినును నరుడు పెంపుడు పక్షుల
స్వార్థపరుడు, క్రూరు డగుట వలన;
నీవు బతికిపోయినావు, సంతోషించు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నిన్ను పెంచకున్న, నిను జంపి, నీ మాంస
మారగించుచున్న వారు గలరు;
మనిషి తినని దెదియు కనరాదు లోకాన!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పాత నమ్మకాల పట్టి వేలాడుచు,
అదియె సంప్రదాయ మనుట మాని,
తప్పు దెలిసి మెచ్చ దగును ని న్నిపుడైన!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఇందు నందు ననక, యెందైన నీ వుందు,
వందు వలన లోకువైతి వేమొ?
సులభ సాధ్యములకు విలువ తక్కువ కదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పిలిచి యెవరు నీకు పెట్టుచుండిరి మేత?
జాలి తరిగె మనుజ జాతిలోన;
భూత దయను మించు పూత గుణము లేదు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నచ్చుకున్న నీవు నరునకు, నిన్ను తా
నెపుడు మెచ్చుకున్న, నిరువురకును
నడుమ బంధ మేదొ ముడిపడి యున్నది!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నష్ట మేమి జరిగె నరులకు నీవల్ల?
కష్ట మైన సుంత కలుగ దెపుడు;
ఐన , నాడుకొందు రన్యాయముగ నిన్ను!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(ఆడుకొను=నిందించు)

అవసరమును బట్టి అరచుచుందువు నీవు,
నరులు నవసరమున నరచుచుంద్రు;
'కాకిగోల' అనుచు కసరు టేలా యింక?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కోట్లలోన కుంభకోణాలు చేయుచు,
పట్టువడియు సిగ్గుపడరు నరులు;
తప్పు లెరుగ వీవు, తల దించుకొన నేల?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

తోలగానె అచటు తొలగిపోదువు నీవు,
మొండికెత్తి అచటె ఉండబోవు;
నిన్ను జూచి నరులు నేర్చుకోవలె చాల!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఏరుకొని భుజింతు వెంగిలి మెతుకులు,
దొంగిలించ వింట దూరి సిరులు;
దొంగ వనుచు నిన్ను తూలనాడుట తప్పు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

'కాకి' శబ్దమునకు కల వర్థములు కోశ
మందు 'నీచ' మనియు, 'అల్ప' మనియు;
ఇట్లనుటకు మూల మెదొ సెలవీయరు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కాకి గోలయందు, కాకి బంగారము
నందు, కాకి చావునందు నున్న
'కాకి' శబ్దమునకు కలదు న్యూనార్థమే!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

బుర్ర లున్న మానవులు కుతంత్రములు ర
చించ గలరు, కొంప ముంచ గలరు;
వారి వలనె నీకు పట్టిన దీ గతి!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

శనికి వాహనముగ నిను జేసి రేలనో?
బ్రహ్మ విష్ణువులకు పనికిరావ?
మోసగించినారు మొదటినుండియు నిన్ను!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నలువ కంచ, విష్ణునకు గద్ద, మరునకు
చిలుక, స్కందునకు నెమలి నమర్చి,
శనికి వాహనముగ నిను జేసినారు సూ!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(నలువ=బ్రహ్మ; మరుడు=మన్మథుడు; స్కందుడు=కుమారస్వామి)

నలువ కయ్యె వాహనము హంస, చాలదా?
నలువ భార్య వాహనమును తానె!
ఏల రెండు పదవు లిచ్చి రొక్కరి కిట్లు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కంటబడిన భయము కలిగించు గుడ్లగూ
బాయె లక్ష్మిదేవి వాహనమ్ము;
దానిపాటి చేయవా నీవు? యోచించు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వడిగ నడువలేదు, పై కెగురనులేదు,
బాతు విశ్వకర్మ వాహన మట!
ఎగురలేని పక్షి, ఎట్లది నిను మించు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

మచ్చ పడిన నొక్క మారు, దానిని తొల
గించుకొనుట తలకు మించినట్టి
పనిగ దోచు, నీవె ప్రత్యక్ష సాక్ష్యము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఆరుబయట 'ఇవియు-అవి' ఆరబెట్టుచు,
నీవు తిందు వనుచు నింద లేల?
ఆరబెట్టువార లవి కాచుకొనవద్ద?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కరుణ లేకపోయె కవి-పండితులకు నీ
పైన మొదటి నుండి, పక్షపాత
వైఖరులకె వారు పాల్పడి యున్నారు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

శాస్త్ర కోవిదులకు సంధించుచున్నాను
సూటి ప్రశ్న, వేయి మాట లేల?
కాకిపైన నేల కక్ష బూనితి రంచు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

లోప మున్న నెత్తి చూపించవలె, నకా
రణ నిరాదరణము లగ్గు కాదు;
సత్య మరయవలదె శాస్త్ర పారంగతుల్?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(లగ్గు=మేలు, క్షేమం)

పక్షి వగుట నీవు ప్రశ్నించ జాలవు,
కాని, నిలువదీయ గలను నేను;
కవిని నేను, నిలువ గలను నీ పక్షాన!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ప్రజలు మీకు తగిన వసతులు కల్పించి,
గౌరవించవలయు కంటబడిన;
ప్రతి దినమ్ము పెట్టవలె మేత పుష్టిగా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

సంఘ మొకటి పెట్టి, సమ్మెను ప్రకటించి,
న్యాయమైన కోర్కె లడుగవలయు;
తీర్చకున్న నింక తినరాదు పిండాలు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

సంఘ శక్తి జూపి, సాధించుకొని న్యాయ
మైన కోర్కె లెల్ల, పైన నింక
గడుపవలయు బ్రతుకు గౌరవప్రదముగా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఎటులో జరిగిపోయె నిన్నాళ్లు, నికనైన
తెలుసుకొన్న తప్పు దిద్దుకొనుచు,
ఉభయతారకముగ నుండిన మేల్గాద?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

గతమునందు నెవరొ కల్పించి యేదొ, నీ
చరిత కొంత మలిన పరచినారు;
కుదురదాయె దిగ్గుకొను టిప్పటికి నది!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వాస్తవముగ నీది ప్రస్తుతి పాత్రమౌ
స్థాయి గాని, అట్లు జరుగకుండె;
పొగడ దగిన నిన్ను తెగడుచుండిరి, కర్మ!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పక్షులందు తాను వైనతేయుడ నని
కృష్ణు డానతిచ్చె గీతలోన;
వారి దృష్టియైన పడదాయె నీపైన!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(వైనతేయుడు=గరుత్మంతుడు)

పెంచకున్న గాని పిచ్చుకలను ముద్దు
చేసినారు జనులు; చేయ రట్లు
ప్రతి దినమ్ము కానవచ్చుచున్నను నిన్ను!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

మాకు రాజకీయ మాలిన్య మంటెను,
నటన, కపట వర్తనములు మెండు;
స్వచ్ఛ జీవనమ్ము పక్షుల సొంతము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

తెలివి కలదు నీకు, కలదు వ్యక్తిత్వము,
బతుకు కొరకు కష్టపడుట కలదు;
నరులు చాలమంది సరిరారు నీతోడ!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నీది నాది అనెడు భేద భావము లేక,
కలసి మెలసి బతుకగలరు మీరు;
స్వార్థపరుడు నరుడు, స్వపర భేదము హెచ్చు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

మేత దొరకెనేని, మీ బంధు మిత్రుల
పిలిచి , వారితోడ కలసి మెలసి
తిను సులక్షణమ్ము కననౌను మీలోన!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ప్రస్తుతాంశమునకు స్పందింతువే గాని,
నరులవోలె కుట్ర లెరుగ వీవు;
తప్పు దెవరికైన తత్ క్షణోచిత చర్య!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పెంచుకొందు వీవు పిల్లల ప్రియమార,
ప్రాలుమాలకుండ బాధ్య తెరిగి;
మనుజులందు కొంతమంది మరతు రిద్ది!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కష్టపడి స్వయముగ కట్టుకొందువు గూడు,
కూర్చుకొనెదు మేతగూడ నీవె;
పక్షిజాతి శ్రమకు పర్యాయ పద మహో!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

తిండి కొరకె బతుకుచుండు వా రుందురు,
బతుకు కొరకె తినెడు వారు గలరు;
స్వీకరింతు వీవు జీవించుటకు తిండి!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

రుచులు మరగి నరుడు రోజొక్క కొత్త ప
దార్థ మారగించ నాత్రపడును;
కాని నీవు రుచుల నేనాడు కోరవు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

అదియు నిదియు ననక, యెది దొరకిన నది
తినుట, తనువు నిలుపుకొనుట లెస్స;
మెచ్చ దగిన గుణము, హెచ్చు నీలో నది!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

దేనినైన నీవు తిందు వందురు, సరే;
మనిషి ' గడ్డి 'తినుట కనుట లేద?
వారి నీతి నీకు వర్తించదా యేమి?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పట్టి చూచి, దాన నెట్టి ప్రమాదము
కలుగదన్న నమ్మకమ్ము నీకు
కలిగిన తరువాతె గైకొందు వెదియైన!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నీతి కథలలోన నీ పాత్ర తరచుగా
కానవచ్చు పూర్వకాలమందు;
ప్రస్తుతమ్మును నది పాటింపబడుచుండె,
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఏవొ కొన్ని కథల, నే యొక రిద్దరో
కవులు మెచ్చినారు కాకి జాతి(తెలివి);
నట్టి మాన్యు లగుదు రభినందనీయులు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కలుగు నశుభ మొంటి కాకి కంటబడిన,
జంట గనిన కలుగు నంట శుభము;
శకునములకు గలదె శాస్త్ర నిబద్ధత?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కాకి అరపు సూచకము చుట్టముల రాక
కనుచు విశ్వసించు జనులు గలరు;
పెచ్చరిల్లిపోయె పిచ్చి నమ్మకములు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వింత చర్య గాద? జంతు ప్రదర్శన
శాలలందు పెంచనేల నిన్ను?
నిన్ను జూడ దలచుకొన్న నెందున లేవు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పరుల నాశ్రయించి బతుకుట హేయము,
బతుకు కొరకు కష్టపడెద వీవు;
కలరు నరుల సోమరులు హెచ్చు సంఖ్యలో!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కోడిపుంజులందు కొన్ని రంగును బట్టి
పిలువబడును 'కాకి' పేరుతోడ;
పులుగులందు నీకు కల దిట్టి గుర్తింపు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(పులుగు=పక్షి)

నీవు మ్రింగుచుండి నింబాది ఫలముల,
విత్తనముల రెట్ట వేయుచుండ,
మొలచి పెరిగి వృక్షములు వృద్ధిచెందవా?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(నింబ=వేప)

శవము చూచుటకును జడిసిపోదురు జనుల్
కాని,తోటి కాకి కన్నుమూయ,
మీరు దాని చుట్టు జేరి రోదింతురు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నలుపు దేహ మనుచు నామోషిపడ నేల?
నరులలోన లేరె నల్లవారు?
నరుడు, మరుడు, హరియు నల్లవారే కదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(నరుడు=అర్జునుడు; మరుడు=మన్మథుడు; హరి=విష్ణువు)

అందగాడు కాడ అవతార పురుషుడు?
నలుపు రంగు వలన నష్టపడెన?
కాన నలపు(రంగు) నీకు కాగూడ దొక లోటు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

దొరకినట్టి దేదొ తోటి కాకులతోడ
కలసి తిను గుణమ్ము కలదు నీకు;
నరుల కబ్బ దెన్ని నాళ్ల కీ సుగుణమ్ము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఆవిరి యగుచుండె జీవకారుణ్యము
రాను రాను నరులలోన; నైన
మేలు గలుగు వచ్చు కాలాన ననుకొందు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

'పంచతంత్ర' మది ప్రపంచ ప్రసిద్ధి గాం
చినది, విష్ణుశర్మ శిష్ట రచన;
పాత్ర నీకు గలదు పంచతంత్ర కథల!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కలిసె రెండు పేర్లు కాకి-కోకిల యని,
కలిసె నొంటి కున్న నలుపు రంగు;
కాని, కలవకుండె గౌరవాదికములు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నీతి కథలలోన -నీ నోటి మాంసపు
ముక్క కొరకు నక్క మోసగించె;
నేడు లాభ మేమి నిను దూరు నరులకు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(దూరు=నిందించు)

నక్కబావ నిన్ను నమ్మించి వంచించె
కల్పిత కథలోన, గాని నీకు
'బుర్ర' కలదు, నీవు మోసపోవుట కల్ల!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కలవు పక్షు లెన్నొ, తెలివిలో నీ సాటి
వచ్చునట్టి దొకటి వసుధ గలదె?
నరులు గుర్తుపట్టినారు నీ తెలివిని!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

అడుగు నెటనొ ఉన్న కడవ నీట డగులక
రాళ్లు వేసి, పైకి రాగ, తాగి
దప్పి తీర్చుకొన్న గొప్ప తెలివి నీది!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

మనుజ జాతి తప్ప మరి యెవ్వరును నీకు
సాటి కారు తెలివితేటలందు;
స్పష్టపరచినారు శాస్త్రవేత్తలె దీని!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నిన్ను జూచి నరుడు నేర్వదగిన యట్టి
పంచ గుణములను వచించియుండె
చాల యేండ్ల క్రితమె చాణక్య సచివుడు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

చంద్రగుప్తు గురుడు, చాణక్య మేధావి
నాడె నిన్ను మెచ్చినాడు మిగుల;
ఐన, మూఢ మనుజు లాదరించరు నిన్ను!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

స్పష్టముగ నెరుంగ జాలను నీవు జీ
వించు కాల మెంతొ, యెంతయైన
స్వీయ పోషణమ్ము, స్వేచ్ఛాపథమె నీది!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

బ్రతుక గలవు నీవు బహుకాల మగుట, 'దీ
ర్ఘాయు' వనుట నిన్ను సార్థకమ్ము;
ఐన నేమి నిన్ను మానవుల్ మెచ్చరు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కోడిపెట్టవోలె గుడ్లెక్కువగ పెట్ట,
వైదు మించకుండు నవ్వి తరచు;
పెరిగెనేని సంఖ్య పెంపు భారము కదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

సంతు పెరుగు కొలది సాకుట కష్టమౌ
నని గ్రహించినారె? అందములను
పరిమితముగ బెట్టి సరిపెట్టుకొందురు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఎగుర గలవు గాని, యెగిరి వేరొక చోటి
కీవు వలసపోవ నిష్టపడవు;
జన్మభూమి నీకు స్వర్గాధికము కదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

జట్టుగట్టి మీరు జరుపు దాంపత్య మా
దర్శవంత మన్య దంపతులకు;
మేము నేర్వవలయు మిము జూచి యెన్నియో!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

గూడు కట్టుటందు, గుడ్లు పొదుగుటందు,
కలసి మెలసి బతుకు గడుపుటందు
లోకవంద్య మగును 'కాకి దాంపత్యము'!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కూడి ఒకొక సారి గుంపులుగా మీరు
సభలు జరుపుచున్న చాడ్పు దోచు;
విషయ మెరుగకున్న, వింతగా నది యుండు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఎవ్వరైన నీకు ఎగ్గు చేసిరయేని,
పగ వహించి మాడు పగల దన్ని,
నిలుపుకొందు వీవు నీదు వ్యక్తిత్వము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!
(ఎగ్గు=హాని, అపకారం)

ఎవ్వడైన గూటి కెగ్గు చేసిన, నీవు
వాని 'కొన్ని నాళ్లు' వదలకుండ
కంటబడిన పొడిచి కసితీర్చుకొందువు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఆత్మ రక్షణమును, ఆహార సముపార్జ
నమును జరుగ సక్రమముగ నీకు
గలవు వాడి గోళ్లు, గట్టి ముక్కున్నది!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నీదు ముక్కు పోటు,నీ కాలి తన్నులు
మరవ రెవరు నొక్కమారు తిన్న!
వజ్రసమము ముక్కు, వాడిగో ళ్లంకుశాల్!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఆత్మ రక్షణార్థ మామాత్ర మైనను
ఎదురు దాడి చేయవేని నిన్ను
ఈగ దోమ సైత మెగతాళి సేయును!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఎగ్గు చేయువారి నెదిరి పోరెదు గాని,
తరుమబోవు కించపరచు వారి;
దాని కన్న నీకు దీని బాధే హెచ్చు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

రెక్క లుండె గాన, రివ్వున పైకి నీ
వెగిరి వాలవచ్చు నిచ్చ మెయిని;
అట్టి శక్తి మాకు అపురూపమే కదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

పనికివచ్చు వస్తువును మాత్రమే సంగ్ర
హించి, వాడుకొందు వీవు, గాని
దాచిపెట్టుకొనవు దోచి మానవు లట్లు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

దోచుకొనుట, దాని దాచుకొనుట నరుల్
నేర్చినారు, నీవు నేర్వ వద్దు;
నీచ మానవులకు నీతోడ పోలికా?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

గుడ్డ అడ్డు పెట్టి కొరికి, పిల్లలు దాని
'కాకి యెంగి' లనుట కలదు గాని,
అంతరార్థ మేమొ అది నే నెరుంగను!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కొంతమంది పిసినిగొట్టు లెంగిలి చేతి
తోడ నెపుడు నిన్ను తోల నిష్ట
పడరు, మెతుకు రాలిపడిన తిందువు గాన!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కలసి మెలసి యున్న కారణమ్మున నర
భాష నీకు చాలవరకు తెలియు;
నీ వెరుంగ గలవు హావభావాలను!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

తరచు మండిపడుచు తరిమి కొట్టెడువారి
దరికి పోవు నీవు, తప్పకుండ
కోపదారి జనుల గుర్తుంచుకొందువు!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కాల మొక్క రీతిగా సాగునా యేమి?
క్షణము క్షణము మార్పు కానవచ్చు;
పొంచి యున్నవేమొ మంచి రోజులు నీకు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

'ఈగ' వెండితెరకు నెక్కి పేర్గాంచెను,
పట్టునేమొ నీకు నట్టి యోగ;
మెవడు చెప్పజాలు నెపు డేమి జరుగునో?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

స్థానబలము గలదు, సంఖ్యాబల మ్ముండె,
మేటి వగుదు తెలివితేట లందు;
జోత లంద దగవె 'జాతీయ పక్షి'గా?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ప్రతి దినమ్ము కానవచ్చు పక్షివి నీవు,
మనుజ జాతి యెట్లు మరచు నిన్ను?
గొడవ లుండు, మాకుగూడ నుండవె పెక్కు?
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

మారి ముందు ముందు, మనుజులు మి మ్మిండ్ల
బెంచుకొందురేమొ ప్రేమమీర?
చూచుచుండ లేద చోద్యమ్ము లెన్నెన్నొ!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

మేళ్లు కీళ్లు గలవు మీవల్ల నని కొంద
రందు, రట్టి వెల్ల వ్యక్తిగతము
లైన దృక్పథమ్ము లనుకొనుటయె లెస్స!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

రాను రాను మీరు క్షీణించుచున్నారు
సంఖ్యలోన; నిట్లె సాగెనేని
'విశ్వ పక్షి' యెల్ల విస్మృత పక్షియౌ!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నిన్ను మెచ్చుకొనుట నేర్వరు జను, లైన
వదలిపెట్టబోవు వారి నీవు;
యుగయుగాల నుండి తెగని బంధము కదా!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

వ్రాయ గలన నూరు పద్యాలు నిన్ను గు
రించి యంచు సంశయించిముందు,
సాహసించి దిగితి, శతక మయ్యెను పూర్తి!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

చిన్ననాటి నుండి నిన్ను నే గమనించు
చుంటి, చదివి తెలుసుకొంటి కొంత,
కొంత ఊహ జేర్చి కూర్చి తీ శతకమ్ము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

నేను చూడలేదు నిను మెచ్చు వారి నొ
క్కరిని, గాన, మెచ్చి గౌరవముగ
నే రచించినాడ నీపేర శతకమ్ము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కలవు పక్షు లెన్నొ, కల వందు ప్రఖ్యాత
మైనవియును కొన్ని, వాని వదలి
నిన్ను కోరి యేల నెన్నుకొంటి ననిన-
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

ఏను చేసినాడ నెవరు చేయని పని
నిను గురించి శతకమును రచించి;
కీర్తి కేమి గాని, గుర్తింపు ఖాయము!
చిత్ర మౌను నీ చరిత్ర కాకి!

కావ్య గౌరవమ్ము కల్పించినాడ నో
కాకి నీకు, శుభము కలుగు గాక!
కాకి శతక రచన కడు తృప్తి నిడె; నింక
సెలవు నాకు, పాఠకులకు స్వస్తి!

## వలసల బతుకు చిత్రం మారట్లేదు ??

వాళ్ళు "పేదరికం" అనే పేగును
మెడలో వేసుకొని పుడమి పై పుడతారు
నాలుగు మెతుకుల సంపాదన కోసం
చంకలోచంటి పిల్ల, నెత్తిపై మూటముల్లెతో
కాళ్ళకు చక్రాలను కట్టుకొని
పనికోసం జగమంతా తిరుగుతారు.

రెక్కలు ముక్కలు గా చేసుకొని
ఆకాశ హర్మ్యాలను నిర్మించి
వీధులన్నీ వెలుగు పూలు పూయిస్తారు
ఇప్పుడు నగరం నడిబొడ్డున
ఉన్నతులు ఊరేగుతుంటే
మురిగి కాల్వల, దొడ్డు దోమల మధ్య
కష్టాల కావడితో వలస జీవితాలు
తెల్లారుతున్నాయి.

దేశ వృద్ధిలో వారు ప్రమిదలవుతున్నారు
వారి చెమట చుక్కలతో
ఎన్నో పునాదులు గట్టి పడ్డాయి
ఎండిన డొక్కలతో వారి మోములు
ఎప్పుడూ ఎండిన ఎడారులే
ఆనందపు జల్లులు అగుపించవు
హాస్యపు పువ్వులు వికసించవు.

పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా
వలసల బతుకు చిత్రం మారట్లేదు
వారి జీవితాల్లో
కాంతి రేఖలు కనిపించట్లేదు.



-తాటిపాముల రమేష్
7981566031

## కలాలను ఝుళిపించాలి..

సమాజాన్ని నిద్ర లేపేది హితం
నిజాలు నిప్పులై విరజిల్లేది సాహిత్యం
అర్థం కాని సాహిత్యం వ్యర్థం
సమాజ హితమే దాని పరమార్థం
సమ భావనే ధ్యేయము...

ఆక్షీకరణలో సృజనాత్మక
కవిత్వంలో మానవత
భావంలో నిగూఢత
శైలిలో వైవిధ్యత
సామాజిక అభివృద్ధియే లక్ష్యం...

సాహిత్యం ఒక వేదన
సాహిత్యం ఒక పరిశీలన
అది ఒక అన్వేషణ
సాహిత్యానికి సమాజం
సమాజానికి సాహిత్యం అన్నట్టు సాగాలి...

నేటి సమాజానికి తగ్గట్టు ఉండాలి
గతాన్ని తోడాలి
భవిష్యత్తును ఊహించాలి
పాఠకున్ని ఆలోచింప జేయాలి
మనసు చలించి విస్ఫోటనం చెందాలి...

ప్రజలను చైతన్యపరిచి
మనసును రంజింపజేసి
సంస్కారాన్ని పెంచి
మంచిని నిర్దేశించే
ఆలోచనలకు పట్టం కట్టాలి...

సాంఘిక దురాచారాలను
అసమానతలను తునమాడాలి
సమసమాజ స్థాపన
సామాజిక పరివర్తన లక్ష్యంగా
కవులు కలలను ఝుళిపించాలి.

-పిల్లి.హజరత్తయ్య,
9848606573

## ప్రకృతి మాత

ఆది మానవులనుండి సంస్కృతి
ప్రోది చేసుకున్నాం
ఆదమరిచాం ప్రకృతిని
పదిలంగా పొదలించడం
ఉదాసీనత వహించాం
ఈప్రొద్దయిన
'వృక్షో రక్షతి రక్షితః' ఆచరిద్దాం
పంచభూతాల ప్రకృతి కాలుష్యం
ప్రజలకే పెను ప్రమాదం
కొన్ని కాలుష్యాలు సహజం
మరికొన్ని కృత్రిమాలు

వాయు జల భూ ధ్వని
సముద్ర ఉష్ణ వ్యర్థఘన
పదార్థాల రేడియోధార్మిక కాలుష్యం
జీవకోటి మనుగడకు అవరోధం
కాలుష్య నియంత్రణ
జగతి ప్రగతికి సౌఖ్యమంత్రం-



-డా.చిట్యాల రవీందర్
7798891795

## మరణంలేని మహాకవి శ్రీశ్రీ

ఆడపిల్ల అగ్గిపుల్ల సబ్బుబిళ్ల
కాదేదీ కవితకనర్హమంటూ
ప్రపంచానికి సమిధనొక్కటి
ధారపోశానంటూ సింహనాదం
చేసిన "ప్రజాకవి" మహాకవి...శ్రీశ్రీ

నవసమాజ నిర్మాణమే
నా ధ్యేయమన్నవాడు
దానినే దర్శించినవాడు
కవిత్వాగ్ని రగిలించినవాడు
కలగన్నవాడు కసివున్నవాడు
ప్రజలకే జీవితాన్ని అంకితం చేసిన
"అభ్యుదయకవి" మహాకవి...శ్రీశ్రీ

ఎముకలు కుళ్ళిన
వయస్సు మళ్ళిన
సోమరులారా ! చావండి !
నెత్తురుమండే శక్తులు నిండే
సైనికులారా ! రారండి !

నెత్తురు గుండెలను అర్పణచేస్తూ
పదండి ముందుకు పదండి
తోసుకు పదండి పైపైకి
అంటూ పౌరుషాగ్నిని
రగిలించిన "విప్లవకవి"మహాకవి...శ్రీశ్రీ

పతితులార ! ఓ భ్రష్టులార !
మీ కోసం కలం పట్టి
ఆకాశవీధిలో పయణించే
జగన్నాథ రథచక్రాలను
భూమార్గం పట్టిస్తాను
భూకంపం పుట్టిస్తానంటూ
బడుగు జీవులకు భరోసా నిచ్చిన
మరిచిపోలేని మరణంలేని
మహాకవి శ్రీశ్రీకిదే నా అక్షరనీరాజనం!
(మహాకవి శ్రీశ్రీ జయంతి సందర్భంగా
అక్షరాంజలి)

-పోలయ్య కవి కూకట్లపల్లి
9110784502

## అన్ని మతాల సారం.. ఆనందమే

కరోనా పుణ్యమాని
మనుషుల మధ్య
మానవత్వం మాట్లాడుతుంది
గుళ్ళల్లో శిలలుగా మిగిలిన దేవుళ్ళు
గుండెల్లో కొలువైతున్నరు.

మసీదుల్లో, చర్చిల్లో కాదు.
మనసున్న ప్రతీ ప్రాణిలో దేవుడు
మరుగున పడ్డ మంచిని
మడిగట్టి మరీ బయటకు తీస్తుండు
మలినాలు లేని మనసే
దేవుడై వెలుగుతుండు.

ఇన్నాళ్లు నీలో ఉన్న
దైవత్వమే దేవుడని తెలియక
వాంఛల వ్యామోహం, కామపు దాహం
దేహమే దేవాలయం
జీవుడే సనాతన దైవం అని
మరిపించి మాయలో ముంచింది

కారు మబ్బులు కమ్మి
కనిపించని శోకం కప్పేస్తుంటే
అన్ని మతాల సారం ఒక్కటై
అంతరంగ పరమాత్మే దేహమైన
దేవాలయంలో దేవుడై మెదలుతుండు.

కష్టమొచ్చిందంటే
కనిపించని దేవుడికై కొట్లాడక
కళ్ల ముందు కష్టాన్ని కనికరించు
కూరినంత సాయం ఒనగూర్చు
కడుపు నింపిన మేలు, మెరుస్తూ
కనిపిస్తే, అదే కదా ఆనందం..
పంచిన ప్రేమేగా పరమాత్మ...!!



-వి. పద్మ
9951445867

## మణిపూసలు

### చెట్లు

చెట్లను మనం పెంచాలి
వానలు బాగా పడాలి
కరువు రక్కసిని తరుము
విధిగా చెట్లు నాటాలి

### ఎండలు:

ఎండలు మండుతుండెను
చెరువు కుంటలు నిండెను
ఎవరికి సాధ్యం కానిది
చంద్రుడే సాధించెను

### కరోనా:

కరోనా వ్యాధి వచ్చెను
సర్కార్ లాక్ డౌన్ పెట్టెను
కరోనా రావద్దంటే
అందరు ఇంటనె ఉండెను

### కరోనా టీకా:

కరోనా టీక వచ్చెను
జనంలో భయం మూగెను
విధిగా టీకా వేస్తే
కరోనసీత ఖత మాయెను

### పాలన:

నీతి పాలన కావాలి
పేదకు మేలు జరగాలి
మంచి నాయకుడి కోసం
అభివృద్ధికి ఓటెయ్యాలి



-యాడవరం రేవంత్ గౌడ్
9441762105

